కథానిక:

నిరవాకాలు

శ్రీ కాళీపట్నపు రామారావు

ఉగ్గుపాలతో పాటు వేదాంతాసవాన్ని సేవిస్తూ పెరిగిన, హింసా సామాజికులముందు నోరు విప్పడానికి నాకు హడలే—కాని గత్యంతరం లేదు.

ఒకప్పుడు ఉంటానిల్లూ కట్టబట్టా లేని '—' వారి కుటుంబం కొంతకాలం తాము తినగా యింకొకరికి పెట్టగలిగే స్థితికి అభివృద్ధి చెందింది. ఇప్పుడు మరికొంతకాలానికి యెప్పటి స్థితికే చేరుకుంది.

'దీనికి కారణ మేమిటి—' అని ప్రశ్నిస్తే రకరకాల జవాబులు వస్తాయి.

ముందుగా సుప్రసిద్ధమైన సుభాషితం — 'ఓడలు బండ్లగు బండ్లు నోడలౌ' తరువాత 'సంపదలు తరంగసంచలంబులు—'

ఈరకం రడీమేడ్ అభిప్రాయాలే కాక యింకొక తెగకు చెందిన అభిప్రాయా లిచ్చేవారు తమ అభిప్రాయాన్ని చాలా తికమకగా చెప్తారు.

"—ఒక కుటుంబమైనా ఒక సమాజమైనా ఆర్థికరంగంలో కాని యితరరంగంలో కాని అభివృద్ధినొందటం పతన మవటం ఒకసూత్రంపై ఆధారపడివుంటుంది. ఆధ్యాత్మిక ఆధిభౌతికరంగాలన్నిటా అత్యున్నత శిఖరా లందుకున్న భారతీయ విజ్ఞానం నాగరికతా మరల అంత ఎత్తుల నుండీ పునాదులకు పతన మవటానికి కారణం ఏదో—ఈ కుటుంబంలోని వివిధపరిణామాలకు కూడా అదే కారణం" అంటారు.

ఏది యేమైనా జరిగినది యిదీ:

సుబ్బారావు పంతులుగారు పుట్టకముందు వారి కుటుంబం కష్టంమీద జీవనం సాగిస్తుండేది. అటువంటిది ఆయనకు పాతికేళ్లు వచ్చేసరికి మంచి ఉచ్ఛస్థితిలోకి వచ్చింది.

తండ్రి వీర్రాజు పంతులుగారు చనిపోయేసరికి ఆరు ఎకరాల పల్లం ఎనిమిది ఎకరాల మెట్టా ఇనప్పెట్టెలాంటి పెంకుటిల్లూ. అయిదు వేల వరకూ ఋణాలరూపేణ చరాస్తి కొంత రొఖ్ఖం-ఇంతా యిచ్చిపోయాడు. అయితే యేం లాభం?

ఇంత ఆస్తి సంపాదించినది అతని ఒక్కని చేతిమీదనే. ఆ చుట్టుప్రక్కల పదారుగ్రామాలలోనూ వీర్రాజు పంతులుగారిని గురించికాని వారి ప్రయోజకత్వం గురించికాని కుమారుడికి వారు చేసిన 'నిరవాకం' గురించికాని చెప్పుకోనివారు ఉండరు.

ఆయన పేరెక్కిన ముసద్దీ. ఆయనగురించి ఉన్న గాథలు యిన్నీ అన్నీ కావు. '—వీర్రాజు పంతులు దస్తావేజు వ్రాశాడూ అంటే ఫాలాక్షుడు వచ్చినా తప్పుపట్టలేడు.' '—బాతుఈక కలం తీసి బరబరలాడించాడంటే ముత్యాలకోవలు!' '—కేసుపట్టి కోర్టుకు తీసుకువెళ్ళాడూ అంటే హరిమీద గిరి పడ్డా గిరిమీద హరి పడ్డా కేసు మాత్రం నెగ్గితీరవలసిందే. మూడవకోర్టులో కాకపోతే ముప్పైమూడవకోర్టులో నన్నా నెగ్గించా డన్నమాటే—' ఈ విధమైన జనాభిప్రాయపు టండనే అతనాఆస్తి అంతా గడించాడు. గడించి ఏకైకపుత్రుడు సుబ్బారావుపంతులు కిచ్చాడు. అందుకే అతను పోయినా ఆయన కొడుక్కు చేసిపోయిన 'నిరవాకం' గురించిమాత్రం ప్రజలమధ్య చిరస్థాయిగా వుండిపోయింది.

అయితే యీ 'నిరవాకం' గురించి ప్రజలకన్నా ఎక్కువగా చెప్పుకొనేది సుబ్బారావు పంతులుగారే. తండ్రి గొప్పదనాన్ని చెప్పుకోవడంలోని శిగుచేటు మనవాళ్లలో చాలామందికి తెలియదు. ఆయన చెపుతుంటారు—

"—ఆరోజులే వేరు! మా చిన్ననాటి భోగాలు జమీందారు బిడ్డలకు జరగవు. ఈ గురువుశెట్టి — యిప్పుడంటే కన్నూమిన్నూ కానకుండా వున్నాడు కాని—అప్పుడు వాణ్ని గురన్నా గురివిగా అని పిలిచేవాళ్లం. తండ్రి వెనుక ఉప్పుగల్లూ చింతపండూ భుజాన వేసుకొని ఊరూరా త్రిప్పి అమ్ముకుంటుండేవాడు. నేనుమాత్రం యిరవయ్యేళ్లు — యిరవైయేళ్లేం మాతండ్రిగారు బ్రతికిఉన్నంతకాలం ఒక్కనాడు కూడా యింటి వ్యవహారాల్లో నైతేనేం బయటి వ్యవహారాలలో నైతేనేం జోక్యం కలిగించుకోవలసిన అవసరం లేకపోయింది. ఆయన అలా జరిపాడు! మహారాజు!!

ఆ రోజుల్లో — దీపావళి రథయాత్రా మొదలైన పర్వదినాలొస్తే వీడు నన్ను మంచి మాటలు ఆడుకొని నాచేతడబ్బు తెప్పించి నాకూ వాడికీ ఖర్చు పెట్టించేవాడు. ఇద్దరం యెంతో స్నేహంగా ఉండేవాళ్లము—"యిలా అని చెప్తూ చెప్తూ అకస్మాత్తుగా వేడెక్కిపోయి గొంతుపెద్దది చేస్తూ అరిచేవారు "—అటువంటివాడు ఆ ఎవ్వారి కిప్పుడు కళ్లు నెత్తిమీదికి వచ్చేయి లక్ష్మీఅనుగ్రహం కలగ్గానే అన్నీ మరిచిపోయాడు. చిన్ననాటి స్నేహితునికే ద్రోహం తలపెట్టాడు పాజీ! ఘూటాకోర్!! మావెర్రోతువన్!!!"

పంతులుగారి ఈ వాక్యాలలో ఆయన అభిప్రాయాలు అటు ఉంచితే కథనమంతా అక్షరాలా నిజం.

వీర్రాజుపంతులుగారు కొడుకును జమీందారు బిడ్డలానే పెంచారు. చచ్చిపోయేటప్పుడు ఏమీకూడా సంపాయించి యివ్వవలసివుంటుందేమోనని మాత్రం ఒకసారీ సంకేతించలేదు.

ఆయనగారు బ్రతికివున్నరోజుల్లో సుబ్బారావుగారి దర్జా సౌఖ్యం బహుశ బట్టవికావు. ఉదయం లేవగానే మస్తుగా తినటం, ఒకచుట్ట ఒకటి వెలిగించి రామమందిరం చేరుకోవటం. అప్పటి కప్పుడే యిటువంటి — జోడ్డునమాణిక్యంతో పుట్టినబాపతు — అంతా అయిదారుగురుచేరుతారు. వీరంతా అక్కడ సభదీర్చి గానకళోపాసనో, చతుర్ముఖ పురాణ పారాయణో ఏదో ఒకటి ఆరంభించేవారు. ఏదైనా ఆరంభించారో—ఇదో ఒకటి ఆరంభించి తీరుతారు— అపరాహ్ణందాకా నిరంతరాయంగా సాగిపోయేది. యింటిదగ్గర ఆడవాళ్లనుంచి కబురుమీద కబురు రాగా రాగా అప్పుడు యింక విధిలేక లేచియిళ్ళకు వెళ్లేవారు. అవకాశం వుంటే స్నానాలు చేసో, లేక తీరిక లేకపోతే వాయిదా వేసో భోజనాలదగ్గర కూర్చునేవారు. వండిన పాకాల్లో 'యిది,బాగు లేదు' 'అది చేశావు కావేం?' అని యథావిధిగా నాదాహంగామా చేస్తూ ఆపూట యేదో తీర్చుకొని మాపటయా మంగడవక ముందేమరం చేసునేవారు. అక్కణ్ణుంచీ మామ్మూలుపాటే! రాత్రికూడా భోజనాలవగానే చేతికందిన తువ్వాలో దుప్పటో కప్పుకొని నోట్లోపెద్దచుట్ట పెట్టుకొని అక్కడికే చేరువారు.

రాత్రిళ్ళుమాత్రం సభికులు చాలామంది వుంటారు. పగలల్లా పనిపాట్లకుపోయిన రైతులూ, తదితరవృత్తులవారుకూడా వస్తారు. రోజు కో కార్యక్రమం. ఒకనాడు కథలు, యింకోనాడు 'కుసలాయకమో' 'హరిహరీ నారాయణ' పదమో. యిందలి నాయకులు ఏకారణంచేతైనా '75' హాజరు అయిపోతే స్వంత కథలు.

ఈ 'మా అనుభవాలు' వింటుంటే ఎటువంటి శ్రోతయినా నిచ్చెరపోవలసిందే. ఏ చచ్చు నాయకుణ్ణి తీసుకున్నా ఒకడూ సాహసాంకునికీ రసికావతంసునికీ బృహస్పతికీ యీడు తియ్యరు.

తరుచు ఎట్టివారినైనా ఉద్విగ్నులను చేసే దెయ్యాల అనుభవాలూ, రసికానుభవాలూ వినవస్తూవుంటాయి. ఒక్కొక్కరు చెప్పే అక్షర సత్యాలు వింటుంటే—యిప్పుడు లేరు గాని—ఆ విక్రమార్కుడూ ఆ శ్రీకృష్ణుడూ పిల్ల కథలు విన్న మరుక్షణంలో వీరి శిష్యులై పోయి వుండరా అనిపిస్తుంది.

ఒక్కరోజున భజన. ప్రతిశనివారంరాత్రీ శ్రీ సీతారాములవారి భజన తప్పదు యిందులో పంతులుది అగ్రస్థానం పంతులు అక్కడి గాయకమణులందరిలోనీ శిఖామణి. ఈభజనల్లో తరుచు పిలువంబడిని శ్రీసీతారాములవారి పేరు చెప్పి ఏకాగ్రతాసిద్ధికోసం భక్తులంతా భంగుకూడా ప్రసాదంగా స్వీకరించడం కద్దు.

పంతులు నేర్చుకున్న విద్య యింతే కాదు. కొన్ని 'భాగోతం' దరువులు కూడా వచ్చు. ముఖ్యంగా 'మద్దిల' (మృదంగం) వాయిస్తాడు. 'పంతులు మద్దిల కడితే కిన్నెర్ల గజ్జల కణ కణ యినిపిస్తది' అని గురువుశెట్టి యెన్నోసార్లు సహజోక్త్యలంకారంగా వర్ణించివున్నాడు. కాగా భాగవతం చదవడం పంతులుసొత్తు - అందులో ప్రహ్లాదచరిత్ర పంతులునిత్యపారాయణం. యింగాపంతులుకు చాలా చాటువులూ శతకాలూ కూడా కంఠస్థం వచ్చును.

ఇదీ పంతులుగారి బాల్యయవ్వనాల్లో జమీందారీ పెంపకం.

సరిగ్గా ఈ రోజుల్లోనే గురన్న ఉదయ సుదివి గాను పగలల్లా గోనెమూటలు వీపున వేసుకొని ఎండనక వాననక దగ్గరనక దూరమనక ఊరూరా తిరిగి చస్తేనో యని యింటికి వచ్చి రాత్రిమాత్రం మొగం చేరుకొనేవాడు. ఎప్పుడూ పంతులు ప్రక్కనే పంతు లిచ్చిన చుట్టముక్క కాల్చుకుంటూ కూర్చునేవాడు—అదే వారిస్నేహం.

స్నేహితు లిద్దరిలో ఒకని తండ్రి తనకొడుక్కు కొన్ని వేలరూపాయల ఆస్తి సంపాదించి పోతే, రెండవవాని తండ్రి కొడుక్కి నెత్తికి చేతు లిచ్చి పోయాడు. శెట్టితండ్రి వట్టి అప్రయోజకుడు. పుత్రాభిమానం యిసుమంతైనా లేనివాడు. పశువులూ పక్షులూ అయినా నయం. యుక్తవయస్సు వచ్చాక పిల్లలు ఆకాశంలోనికి తీసుకొనిపోయి ఆహారం సంపాదించడం మప్పుతాయి. కాని శెట్టితండ్రిమాత్రం కొడుక్కి యుక్తవయస్సు యింకా వచ్చీరాకుండానే రెక్కపట్టుకొని విశాలవిశ్వంలోకి ఈడ్చుకుపోసాగాడు.

అయితే నేం, శెట్టిఅదృష్టం బావుంది. తండ్రి చిన్నప్పటినుంచీ కష్టపెట్టడం తప్ప ఒక్క దమ్మిడీ ఎత్తు 'నిరవాకం' చెయ్యక పోయినా పదేళ్లలో ఊర్లో మోతుబరి ఆసాములతో తలెత్తుతి విరసాగాడు

'ఇందులో కిటుకు ఏమి యుంటుందీ?' అంటే చెప్పలేం.

శెట్టి తరుచు ఉద్ఘాటించే పంతపదంనుండి ఏమైనా చేయగలిగితే ఆ పంతపదము ఇదీ —

"—నమ్మకం చెడగొట్టుకొన్న బతుకు ఏం బతుకూ అంటాను. ఒకళికి ఉపకారం చెయ్యి! అక్కా. నేనీ ఉపకారం చేశేనను, ఈకూరాకు తింటానను? అంతేకాని దొంగలింకా! శీ! అట్టి బతుకు సరే—కుక్క బతుకు సరే!"

శెట్టి పదేళ్లలో పదివేలరూపాయల ఆస్తి సంపాదించాడు. ఈ యింత ఆస్తి తనకు కుక్కబ్రతుకు మీది ఈ అసహ్యం వల్లే పరహృదయ దయాద్రవణశక్తివల్లే సంపాదించా నంటాడు. నమ్మాలి మరి!

అయితే లోకులు అనుకునేదంతా యేమిటయ్యా అంటే—

"—బాబూ, తెలియం దేముందీ! లోకులు పలుగాకులు!.. ..."

ఇంకా చాలా భారతం ఉంది. దానితో నోటికి తాళం.

యేమైనా పంతులు జీవితంమాత్రం శెట్టి బ్రతుకువంటిది కాదు. లోకులచే వేలు మడిపించుకొనని జీవితం. తండ్రి అలా పెంచాడతన్ని. "చిన్నప్పణ్ణుంచీ రాజాదర్జాతో పెరిగినబాబు! పాలూనీలూ ఒకటే ననుకునే దరమరాజు! అతని కతగాడే సాటి" అనిపించుకున్నాడు. చివరిరోజుల్లో ఈనీతిమంతుడి ముఖం యెవరూ చూడకపోతే మానకపోదురుగాక - ఫలానా అకార్యం చేసాడని వేలెత్తి చూపించుకో లేదు.

అయితే యిట్టి సుశిక్షిత బ్రాహ్మణవంశజుణ్ణీ ధర్మశీలినీ భక్తుణ్ణి పండితుణ్ణీ నీచుల నంటవలసే దారిద్ర్యమెలా ఆవేశించిందీ అంటే - అదే చిత్రం! భగవచ్ఛిద్విలాసం!!

శ్రీమన్నారాయణమూర్తివారి లీలా జగన్నాటకగ్రంథంలోని ఈ యేకాంకికకు నాంది యిదీ:

వీర్రాజుపంతులుగారు అనుకోని విధంగా చెప్పి పెట్టకుండా హరీ మనేశారు.

దీనితో నిరాలంబుడైన పంతులు తన భారాన్ని మోయ నంగీకరించే దాత యెవరా అని దిక్కులు చూడసాగారు.

పంతులుఅంతరంగాన్ని గ్రహించి పరోపకారపరాయణుడూ, ఆబాల్యస్నేహితుడూ అయిన గురన్న ఒకనాటిరాత్రి తొలిజాము సమావేశాల్లో కలుసుకొని ఏకాంతస్థలానికి తీసుకపోయాడు. అక్కడ సక్రమమైన నాందితో ఆరంభించి ఒక చిన్న పాఠం చెప్పాడు.

బంధువు లంటే యెవరో వాళ్లు బయటికి తీయతీయటిమాటలు చెపుతున్నా లోపల హృదయాంతరాళాల వాళ్ల నిజస్వరూపం యెట్టిదిగా వుంటుందో!

స్నేహితులంటే యిట్టివారో, వాళ్లు బయటకు ఆడేమాటలూ. చేసే కార్యాలూనిష్ఠురంగా ఉన్నావాళ్లు అంతఃకరణాలో ఏమిటి కోరుతూ వుంటారో—

వారి మీద ఉన్న లేదా యేమిటో—

మొదలైన విషయాలగురించి అనేక ప్రత్యక్ష పరోక్ష అనుభవగాథలనుండీ భూతభవిష్యద్వర్తమానాది త్రికాలాల్లోంచీ అనేక ఉదాహరణ లిస్తూ సహేతుకంగా ఉపన్యసించాడు.

శెట్టి చేసిన ఈ నిస్వార్థబోధనతర్వాత కొద్ది దినాలకే పంతులు గురన్నా నేస్తాలై పోయారు. తక్షణం కాకపోయినా నిలకడమీద శెట్టి గొంకు యీపికాల హృదయంకు అర్థం తెలిసింది కూడా!

వీర్రాజుపంతులుగారి దినవారాల కైతేనేం, ఆపత్సమయంలో స్థైర్యం కొల్పడానికి వచ్చిపోయే బంధువులకి మర్యాదచేయ్యడంతో నైతేనేం అగమాసాలనాటికే తండ్రి రొఖ్ఖంరూపంలో మిగిల్చిన కొద్దివందలూ హరించుకుపోయాయి.

అట్టిసమయంలో గురన్నవంటి నేస్తం ఉండబట్టే పరిపోయింది. పంతులు ఒక్కసారి ఒక్కమాట మాత్రం అనగానే యింక దేనికీ తడుముకోవలసిన అవసరం లేకపోయింది. బియ్యం కావలసినా ఉప్పు కావలసినా పప్పు కావలసినా గురన్నకొట్టుకు పంపిస్తే అన్నీ వచ్చిపడేవి.

అయితేమూడునెల్లనాడు 'యవహారంలో చిన్న తిరకాసురావడంవల్ల' గురన్న నోరు తెరవక తప్పిందికాదు. కాని పంతులు వద్ద అంతకుముందే దమ్మిడీ లేదు. కాగా సంవత్సరికాలకైతేనేం, మరికొన్ని పైఖర్చులకైతేనేం డబ్బు కావలసివుండెను. అందుచేత పంతులుకు రావలసిన ఋణాలనుండి ఏమైనా వసూలవుతుందేమోనని చూశారు. కాని ఋణగృహీతలు ఎవరికివారే తమ అశక్తతనూ విచారాన్నీ వెలిబుచ్చుతూ ఆరు మాసాలకు తక్కువకాని వ్యవధిని కోరారు.

అప్పుడు గురన్న ఆలోచించి ఒక యుక్తి పన్నాడు. భార్య పుట్టినింటినుండి తెచ్చుకున్న స్త్రీధనం వెయ్యిరూపాయిల పైచిలుకుందట. తను ఎన్నిసార్లడిగినా 'శశా, కాదు పొమ్మం'దిట. అన్న కాబట్టి పంతులు మొఖమాట పెడితే కాదన లేదట.

చివరకు గతిలేక పంతులు అందుకే తలపడ్డాడు. శెట్టిమాత్రం 'తను మధ్యను ఉంటే వ్యవహారం కుమటపడదనే అధైర్యం వల్ల యిందులో జోక్యమే కలిగించుకోలేదు. చివరకు వ్రాతకోతలు జరిగేటప్పుడైనా ఊర్లో లేడు. అట్నుంచి వచ్చాక పంతులు అంతా చెప్పాడు.

ఆ రోజుల్లో సొమ్ము ఆలీని వడ్డీకిస్తే (తణకా లేని వ్యవహారం) నెలకూ నూటికీ రూపాయిన్నర ధర్మవడ్డీగా వుండేది. అటువంటిది ఈ వ్యవహారంలో వడ్డీరేటు రెండు రూపాయిలనేసరికి శెట్టి మొదట నిశ్చేష్టుడైపోయి తర్వాత మండిపడిపోతూ యింటికి పరుగెత్తాడు. పంతులు ఆ వైఖరి చూసి అనుమానిస్తూ తనూ వెనకనే వెళ్లాడు:

శెట్టి పెళ్ళాన్ని పట్టుకొని గట్టిగా చావతిట్టేశాడు. అంతాశవుంటే జయం పొందదన్నాడు. వడ్డీరేటు తగ్గించకపోతే సొమ్ము యెలా వసూలౌతుందో చూస్తానన్నాడు. అగ్గి రుద్రుడై పోయాడు. చివరకు పంతులే శాంతపరిచాడు. అతడు శెట్టి వృథాకోపంలోని పొరపాటును తెలివిగా ఎత్తి చూపించాడు.

(17వ పేజీ చూడుడు)

శ్రీ ఎల్. ఎస్. గోపాలస్వామి: చెన్నపట్నంలో హిందూస్తానీ గుజరాతీ కుటుంబాలు ఉన్నందున ఆ రెండు భాషల్లోనూ కూడా పాఠాలు చెప్పించటానికి ఏర్పాట్లు చేస్తారా?

స: ఆ ఏర్పాట్లు కొన్ని చోట్ల ఉన్నవి. క్రిస్టియన్ కాలేజి హైస్కూలులో ఉత్తరాది బాలురకు ఆ సౌకర్యము ఉన్నది.

శ్రీ బి. ఎస్. మూర్తి: తమిళంలో అనేకమంది తెలుగు పిల్లలు పాఠాలు చదువుతున్నారని కమిటీవారు తెలుపుతున్నారు. విద్యాశాఖా డైరెక్టరు నివేదిక వచ్చేలోపున ఈ వ్యవహారం ఎక్కడ జరుగుతోందో ప్రభుత్వంవారు విచారిస్తారా?

స ఏమి చెయ్యడానికి గాని ప్రభుత్వానికి విద్యాశాఖ డైరెక్టరు నివేదిక రావలసిందే.

శ్రీ దిగుమర్తి రామస్వామి :- విచారణసంఘ నివేదిక ఏకగ్రీవమైనదా? లేక ఎవరైనా భిన్నాభిప్రాయము వ్రాసినారా?

ఘ:-నాకు తెలిసినంతవరకు నివేదిక ఏకగ్రీవమే.

శ్రీ జి. రాజమన్నార్ చెట్టి:- అనేకమంది హరిజనబాలురు; వారు అధికసంఖ్యాకులుగా ఉన్నచోట్ల తెనుగుబళ్ళు, తరగతులు లేక బాధపడుతూండగా వారిని తమిళంలో పాఠాలు చదువుకోవలసిందిగా బలవంతంచేస్తున్న సంగతి మంత్రిగారు చిత్తగించారా?

స.-ఇంతవరకు నేను చెప్పగలను. ఐతే డాక్యుమెంట్లు నాదగ్గర లేనందున ఈ లెఖ్ఖలు సవరించుకోవలసి రావచ్చునేమో. 56 ప్రాథమిక పాఠశాలలలో తెనుగు ఉపాధ్యాయులను పెట్టినారు. 16 స్కూళ్లల్లో తెనుగు ఉపాధ్యాయులను పెట్టినా తెనుగుపిల్లవాడు ఒక్కడు కూడా వచ్చినాడు కాదు.

శ్రీ తెన్నేటి విశ్వనాథం: పిల్లలు రాకపోవడం మేస్టర్లు లేక కాదా?

స: తెలుగు ఉపాధ్యాయులను పెట్టినా ఒక్క తెలుగు కుర్రాడూ రాలేదని నేను చెబుతున్నాను.

శ్రీ బ్రహ్మానందరెడ్డి ఎగ్మూరు ప్రెసిడెన్సీ గరల్స్ హైస్కూలు (గవర్నమెంటు)లో నుండి తెలుగు ఉపాధ్యాయురాలిని పంపించివేసినమీదట ఆ పాఠశాలలో తెనుగుతరగతులు ఎత్తివేసినమాట నిజమేనా?

స: నాకు తెలియదు. అది సహాయ పాఠశాలన్నా, ఏమన్నా ఏమో!

హమీద్ ఖాన్ ఒక పాఠశాలలో ఒక్కడే తెనుగు ఉపాధ్యాయుణ్ణి పెట్టి, మిగతవారంతా తమిళ ఉపాధ్యాయులైనందువల్ల ఆ పిల్లలు చాలా కష్టపడుతున్న మాట తెలియునా?

స: అది వివరముగా విచారించవలసిన విషయం.

శ్రీ నాగప్ప: మంత్రిగారు తప్పు సమాధానాలు ఇస్తూన్నందున సరియైన సమాధానాలు ఇవ్వనందున, వారు అసలు విషయాలను చెప్పేట్టు అధ్యక్షులు సభ్యులకు తోడ్పడతారా?

స్పీకరు :- మంత్రిగారు తప్పు సమాధానాలిస్తున్నారో సరియైనవి ఇస్తున్నారో 'నాకు తెలియదు' ఈ సందర్భంలో నే నేమీ చెయ్యలేను.

బి. ఎస్. మూర్తిగారు :- తెలుగుపిల్లలు లేనిచోట్ల తెలుగు ఉపాధ్యాయులను పెట్టి పిల్లలు లేరని సాకు చెప్పడమూ, పిల్లలు ఉన్నచోట్ల ఉపాధ్యాయులను పెట్టకుండా చెయ్యడమూ, జరుగుతూన్న కథ ఇది అని మంత్రిగారు తెలిపిన సమాధానాన్ని బట్టే చెప్పవచ్చునా?

స: నేను ఆ ప్రశ్నకు సమాధానం చెప్పలేను. కార్పొరేషనుక్రింద కొన్ని పాఠశాలలు ఉన్నవి. మిగతావి సహాయపాఠశాలలు. సహాయపాఠశాలల సందర్భంలో ఏమి చెయ్యడమో నాకు పాలుపోకున్నది. అందునిమిత్తమే ఈ కమిటీని వేశాము. దానిపై విద్యాశాఖ డైరెక్టరు అభిప్రాయం వచ్చాక అవసరమైన సిఫార్సులపై చర్య తీసుకుంటాము.

నిరవాకాలు

(11 వ పేజీ తరువాయి)

"యెందుకురా, అలా వెర్రెత్తిపోతావ్! నువ్వు అనేదానికీ దీనికీ యేమాత్రం తేడా? అర్ధరూపాయేనా? నెలకు అదనంగా యింకో అయిదు రూపాయలు యెక్కువౌతుంది! అంతే! ఆరు మాసాల్లో ఎలాగా తీర్చేస్తాం. మహా అయితే ముప్పై రూపాయలే కదా? ఆడపిల్లకు ఆ మాత్రం ఆశకూడా లేకపోతే యెలారా?"

సెట్టి ఈ సత్యాన్ని కాదనలేకపోయాడు. అక్కడకూ అక్కసు భరించలేక "సీ! ఆశపోతులంజ!" అంటూ కేండ్రించి "తూ!" అంటూ దూరంగా ఉమ్మి ఊరుకున్నాడు.

అయితే ఈ వ్యవహారంలో ఓ చిన్న పొరపాటు జరిగింది. భగవల్లీలలగురించి ఇంత చదువుకున్నా పంతులుగారు ఒక చిన్న ప్రాథమిక సూత్రాన్నే మరిచిపోయినట్టుంది. తాను ఒకటి తలుస్తే దైవం యింకొకటి తలుస్తాట్ట. ఈ ప్రాథమిక సూత్రాన్ని మరిచిపోయిన పొరపాటుకే పంతులు రెండువేల రూపాయలు జరీమానా చెల్లించాడు.

ఆరుమాసాలనాడు తీర్చేయవచ్చు ననుకుంటూ చేసిన అప్పు - తీరా తీర్చవలసివచ్చేసరికి ఆరు సంవత్సరాలు పట్టింది.

వచ్చిన చిక్కేమంటే పంతులు మెత్తదనం చూసి ఋణగ్రహీతలు ఒంటికాలున నడవసాగారు. గురువుశెట్టి వాళ్లను ఒక్కొక్కళ్లనే భయపెట్టే, భంగపెట్టే, పంతులుని పట్నం తీసుకువెళ్లీ, రిజస్టరునోటీసు లిప్పించీ, వాళ్లు అప్పంతా తీర్చలేమంటే పంతులుతో చెప్పి వడ్డీలూ అవీ కొంతవరకూ మాఫీచేయించీ ఆరేళ్లనాటికిగాని వ్యవహారాలన్నీ సొత్తుపరచలేకపోయాడు. అప్పటికైనా భార్యవ్యవహారంమాత్రం అతడికి సాధ్యమయ్యిందికాదు.

ఆరేళ్లలోనూ వడ్డీ ఒక్కనాడుకూడా చెల్లుపెట్టబడకపోవడంవల్లనైతేనేం మూడేళ్ళనాడు పద్దు త్రిప్పి వ్రాయడంలో మొత్తానికి వ్రాయబడడంవల్లనైతేనేం వెయ్యి రూపాయల అప్పు మూడువేలకు పెరిగింది.

వడ్డ కొంత మాఫీచెయ్యడం ధర్మమంటూ శెట్టి పెళ్లాన్ని ఎంతో బలవంతిపెట్టాడు. కాని ఆమె వినదికాదు. చివరకు శెట్టికి బాగా కోపం వచ్చి అరిచాడు.

"ఆ బాపనయ్య గొంతుకు అడ్డంగా కోదామనుకుంటున్నావా రాకాసిముండా!" అంటూ పంతులువంక తిరిగి "యిదుగో పంతులూ! దీనికి ఒక్కదమ్మిడీ శెల్లు బెట్టకయ్యా! దీని యబ్బ యెవడొచ్చి వసూ జేస్తాడో చూస్తాను."

—అంటూ పెళ్లాంతో కత్తికట్టి నిలబడ్డాడు. కాని యింతచేసినా లాభం లేకపోయింది. ఆమె పెరటిదారిన పంతులుయింటికి వెళ్లి "ఆడపిల్లను! యిది తగునా అన్నయ్యా!" అంటూ రెండు మూడుసార్లు ముక్కుగబీల్చేసరికి మరునాడే పంతులు అణా పైసలతో సహా అంతా కక్కేశాడు.

ఏతావతా చెప్పవచ్చేదేమంటే - ఆరేళ్లనాడు అంతా లెఖ్ఖచూసుకుంటే స్థిరాస్తి విడిచి మిగిలిన చరాస్తిఅంతా హరించుకుపోయింది. ఒక్కదమ్మిడీ మిగల్లేదు.

భూములవల్ల సాలీనా గరిశన్నర ధాన్యం అంబారం నూటయాభై రూపాయలవరకూ శిస్తులూ వచ్చేవి. కాని పంతులువారి కుటుంబ ఖర్చు యివికాక యింకే నాలుగువందలలో పైన అయ్యేది.

అంత కర్చు ఏల అయ్యాదీ అంటే అయ్యేదీ! పంతులుగార్కి పుష్టికరమైన ఆవులను ఇంటిముందు ఉంచటం సరదా. అందుచేత ప్రతి యేడాది ఓ ఆవును కొనేవారు. అతనికి చిన్నప్పణ్ణుంచీ ఆవులను కొనటం అలవాటులేదు. ఎవరో కొనిపెట్టేవారు. ఒకటె నూరు రూపాయలకు తక్కువకు లభించేదికాదు. పాడి అయిపోయాక అమ్మటం కూడా ఎవరో పుణ్యం కట్టుకునేవారు. ఒకటీ యాభై రూపాయలకు ఎక్కువకు అమ్ముడు పోయేదికాదు. కాగా వచ్చిపోయే అతిథి అభ్యాగతులకూ లోటు వుండేది కాదు. ఊర్లోకి ఎవరు వచ్చినా పంతులుయింటికే కబురు. తర్వాత పెద్ద ఖర్చు పంతులుగారి భార్య; నాలుగుపురుళ్లు తర్వాత ఆమె సుస్తీ మనిషి అయిపోయింది. అందులోనే కానుపులు—బలానికి మందులు! నక్షత్ర శాంతులు! దానాలు! ధర్మాలు!

యింక పంతులుగారు చూస్తే ఒక్క పుణ్య సంపాదనా, కీర్తిసంపాదనా తప్పిస్తే యింకే విధమైన సంపాదనకూ తలపడేవారు కారు.

యేమైతేనేం యీ పద్ధతి ఆదాయవ్యయాలవల్లా శెట్టి - కాదు శెట్టిభార్య ఋణంవల్లా - చివరకు చరాస్తి సున్నాకుసున్నా, హళ్లీకి హళ్లీ అయింది. అక్కడితో పంతులుగారి ధోరణి మారిపోయింది. ఆ బాల్యస్నేహితుల స్నేహాన్ని చూడలేనివారి మాటలు ఏవో తల కెక్కాయి కావోలు; లేక తన దారిద్ర్యం శెట్టి అభివృద్ధీ రెండూ చూసి అసూయే పుట్టిందో స్నేహితునితో పోట్లాడి మాటలు మానేశారు.

ఆ తర్వాత కొంతకాలంకు పరప్రేరణంవల్లో ఈ యిహలోకసాగరాన్ని ఈదటానికి తుచ్ఛ ధనార్జన చేయక విధి లేదనే సత్యాన్ని అంగీకరించాడు. ఆర్జనోపాధులు వెతగ్గా వర్తకం తగిలింది. కాని మొట్టమొదటిసారే మొగ్గలెయ్యకుండా నడవగల్గిన పసిబిడ్డనుగూర్చి ఈ కలికాలంలోకూడా యెక్కడా వినలేదు.

పంతులు భూమిమీద అప్పుచేసి వేరుశెనగవర్తకం ఎలావుంటుందో మచ్చుచూశారు. అదృష్టవశాత్తు మచ్చుమాగానే తెలిసింది. ఒక్కరెండు వందలరూపాయలనష్టంతోనే ఒడ్డెక్కింది. చేయికాలిన బిడ్డడిలా మరెప్పుడూ వర్తకం జోలికి పోలేదు.

అయితే యీ ప్రయోగంవల్ల యింకో సత్ఫలితం కూడాను. రెండేళ్లదాకా డబ్బుకోసరం తడుముకోవలసిన అవసరం లేకపోయింది. వర్తకం కోసరం చేసిన అప్పు వర్తకం ఆపివేసినా దానిని తీర్చలేదు.

మూడవ ఏటి అంతాన ఋణగ్రహీత దావా తెస్తానంటే మూడెకరాలమెట్టు అమ్మి అసలు వృద్ధులక్రింద పదిహేనువందలు వాడికి చెల్లించి మిగతా డబ్బుతో మరోసంవత్సరం నరమెల్లిగా వెళ్లబుచ్చారు.

ఇదంతా చూసి యెవరైనా "ఏం పంతులుగారూ! భూములున్నాయి కదా, వ్యవసాయం పెట్టరాదా?" అంటే..

"......పెట్టినదినములలోపల నట్టడవులకైన వచ్చు నానార్థములున్......"

విన్నవాడు పద్యభావంయొక్క సత్యాసత్యాలను గ్రహించినా గ్రహించకపోయినా పంతులుగారి కంఠంలో ధ్వనించే నైరాశ్యానికి కరిగిపోతాడు. కాని తనను కదలించిన ప్రమేయాన్ని గుర్తించేవిజ్ఞానం లేక అదంతా కంఠంలో గొప్పదనమే నని పొగుడుతారు. పంతులుగారు ఈ ఊరటతో అంతా మరిచిపోతారు.

కాగా పంతులుగారి యిష్టదైవమైన నారాయణమూర్తి తన భక్తుణ్ణి సిరినించి వంచించినా సంపదనుంచి మాత్రం వంచించలేదు. పదమూడేళ్లలో ఎనమండుగురు పిల్లలను ప్రసాదించాడు. అందులో ఆరుగురు శ్రీమహాలక్ష్మీసమానురాండ్రు.

ఆపిల్లలు చిరిగి బాగా మాసిపోయిన బట్టలు కట్టుకొని తిరుగుతున్నప్పుడూ, శీతాకాలంలో యే చిరుగుల దుప్పటి కోసరమో నలుగురూ కొట్లాడుకునేటప్పుడూ, ఆపిల్లలు తమకు యివి కావాలనీ అవి చాలవనీ ఏడ్చేటప్పుడూ, ముఖ్యంగా ఆ ఆడపిల్లలను చూచేటప్పుడూ మాత్రం ఒక్కొక్కసారి గుండె బెజారెత్తుతుంటుంది. నాగరికత పల్లెలకు కూడా బాగా వ్యాపించిపోయిన ఈ నవభారతంలో - అందులో అగ్రవర్ణులమని నేటికీ బోరలు విరుచుకొనే బ్రాహ్మణ్యంలో - ఆడపిల్లను కనుక్కున్న తండ్రిపాట్లను, యిహలోకదృష్టి తక్కువైన పంతులుగారుకూడా గుర్తించారు.

ఎప్పుడైనా భవిష్యత్తు మనఃపథాన చోటు చేసుకొని బయటకు వస్తే ఒకోక్కసారి "......రాతిలో మండూకంబే క్రియ బ్రతుకుచుండున్......" అంటూ కడ్డాదివారి పిప్పరమెంటో లేక బమ్మెరవారి యింకొక మందార మకరందమో త్రోసి దుఃఖాన్ని మరిచిపోతారు. యింకో అప్పుడుమాత్రం వీసమెత్తు కారణమైనా అవసరం లేకుండానే పెళ్లాన్ని తిట్టిపోయడమో, యింకా మతి తప్పితే ఒళ్లు హూనం చెయ్యడమో జరుగుతుంటుంది.

ఈ రెండో పద్ధతి అవలంబించేటప్పుడు మాత్రం అది కాస్తా అయాక పెద్దకుమారుని పిలిచి తండ్రి యెప్పుడో కొనియిచ్చిపోయిన ఆ పెద్ద మృదంగాన్ని బయటకు తెప్పించుకొని ఆరంభిస్తారు.

"ధిత్తోం! ధిత్తోం! తకిట ధిత్తోం......"

అంటూ మృదంగం అరవనారంభిస్తుంది. క్రమంగా స్థాయి హెచ్చుతూపోయి కొంతసేపటికి "ఝుణఝుణఝుణఝుణ" మంటూ పిడుగులు కురుస్తున్నట్టు మ్రోగుతుంది. అప్పుడు ఆ పిడుగులుపాటులో శబ్దబ్రహ్మం సాక్షాత్కరించగా పంతులుగారి క్షుభితహృదయం నెమ్మది నెమ్మదిగా శాంతించి క్రమంగా తన్మయత చెందుతూ చివరకు మైకంతో కన్ను మూస్తుంది.

ఇటియోల్

ఆదర్శమైనది

పూతి నాశిని

క్రిమి నిర్మూలిని

హాయి నిచ్చును

విషసంబంధం కాదు!

I.T.L.

తయారించువారు:

ది మైసూరు ఇండస్ట్రియల్ & టెస్టింగ్ లాబొరేటరీ లిమిటెడ్,

మల్లేశ్వరం, బెంగుళూరు.

విక్రయ ప్రతినిధులు: బెస్ట్ & కంపెనీ, లిమిటెడ్,

పోస్ట్ బాక్స నెం. 63, మదరాసు.